
సాక్షి పల్నాడు

శుక్రవారం। 22। ఆగస్టు। 2025



అంకాలమ్మ తల్లికి బోనాలు

కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లికి గురువారం రాత్రి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. కుంకుమ బండ్లు కట్టుకుని మేళాలతో ఊరేగింపుగా గుడికి చేరుకున్నారు.



నిండు కుండలా పులిచింతల

అచ్చంపేట : సాగర్ నుంచి పులిచింతలకు 4,28,115 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4,32,175 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం 31.8797 టీఎంసీలు ఉంది.



ఉచిత ప్రసాద వితరణకు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఉచిత ప్రసాద వితరణకు గుంటూరు రెడ్డి పాలేనికి చెందిన తిరుమలశెట్టి భార్గవ తేజ, సాయి చరితలు 1,00,116 విరాళాన్ని అందించారు.

న్యూస్‌రీల్

నల్ల బ్యాడ్జీలతో అటవీ సిబ్బంది నిరసన



నరసరావుపేట రూరల్: అటవీ శాఖ సిబ్బందిపై టీడీపీ ఎమ్మెల్యే దాడికి నిరసనగా పల్నాడు డివిజన్ సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈనెల 19వ తేదీ రాత్రి శ్రీశైలం శిఖరం చెక్‌పోస్ట్ వద్ద టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విధుల్లో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై దాడి చేశారు. దీన్ని తీవ్రంగా ఖండించిన డివిజన్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎమ్మెల్యేను, ఆయన అనుచరులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ డి.వి. రమణ, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అమీర్ జానీ బాషా, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చి జంతువుల వేట



బెల్లంకొండ: అటవీ ప్రాంతంలో విద్యుత్తు లైన్‌కు ఇనుప తీగలు అమర్చి జంతువులను వేటాడటాన్ని సిబ్బంది అడ్డుకున్నారు. మండలంలోని వెంకటాయపాలెం అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి విద్యుత్ లైన్‌కు కనెక్షన్ ఇచ్చి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు తీగలను అమర్చారు. గమనించిన విద్యుత్ సిబ్బంది అక్కడకు వెళ్లగా పరారయ్యారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని సబ్ స్టేషన్ తరలించారు. వేటగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏఈ పవన్ కుమార్ తెలిపారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతం



మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసిఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం సామూహిక శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి తిరువంజనం, 9 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు స్వామి వారి వస్త్రాలు వేలం

శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలోని శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దిగువ సన్నిధిలోని ఆలయ ఆవరణలో పాట ఉంటుందని ఈవో తెలిపారు.

ఫ్లెక్సీ తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు



భట్టిప్రోలు(వేమూరు): భట్టిప్రోలు మండలం చింతమోటులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ఫ్లెక్సీలు తొలగించేందుకు అధికారులు సిద్ధంకాగా, గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. విషయాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. చింతమోటుకు చేరుకున్న అశోక్‌బాబు గ్రామంలో ప్రభుత్వం అనుమతి లేని ఫ్లెక్సీలు అన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. వేమూరు, చుండూరు సీఐలు అంజనేయులు, శ్రీనివాసరావు, భట్టిప్రోలు, కొల్లూరు ఎస్‌ఐలు శివయ్య, జానకీ అమర్‌వర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో తెలుగుదేశం ఫ్లెక్సీలు, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ఫ్లెక్సీలని తొలగిస్తే వెళ్లిపోతామని వరికూటి వారికి స్పష్టం చేశారు. గ్రామాల్లో గొడవలు జరగకుండా పోలీసులు బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఫ్లెక్సీల వ్యవహారం పరిష్కారం చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు పడమటి శ్రీనివాసరావు, బొల్లెదు ప్రతాప్, ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చోర్.. పల్నాడు బేజార్ !

- జిల్లాలో వరుస చోరీలు
- చోద్యం చూస్తున్న పోలీసులు
- తాజాగా వినుకొండలో పట్టపగలు మహిళలను హత్య చేసి బంగారం చోరీ
- గతంలో ఇక్కడే ఇద్దరు మహిళలను చంపిన దొంగలు
- గురజాల, దాచేపల్లి, చిలకలకూరిపేట సర్కిల్ పరిధిలో నిత్యం దొంగతనాలు
- సాయంత్రం జిల్లాలోకి వచ్చి దొంగతనాలు
- తెల్లారి రైలెక్కి వెళ్లిపోతున్న ఉత్తర భారత్ ముఠాలు
- ప్రత్యర్థులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో ఖాకీలు బిజీ

తొలి ఆరు నెలల్లో 268 దొంగతనాలు



పుష్పలత మృతదేహాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ



హత్యగురైన మహిళ పుష్పలత ఇంటిని పరిశీలిస్తున్న ఎస్పీ, సిబ్బంది

సాక్షి, నరసరావుపేట: పల్నాడులో దొంగలు చెలరేగిపోయి పోలీసులకు సవాల్ విసురుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట దొంగతనాలు చేస్తూ, ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. దొంగతనాలు చేసే క్రమంలో పాశవికంగా ప్రాణాలు కూడా తీస్తున్నారు. ముఖ్యంగా ఒంటరిగా ఉన్న మహిళలే టార్గెట్‌గా చేసుకుని హత్యలు, చోరీలు చేయడం ఆందోళనకరంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వినుకొండ పట్టణ పరిధిలో ఏకంగా ముగ్గురు మహిళలను హత్య చేసి దొంగలు చోరీలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా గురువారం వినుకొండ పట్టణంలో ఒంటిమీద బంగారం కోసం మహిళను హత్య చేసినట్టు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణ కొచ్చారు. కళ్యాణపురి కాలనీలో ఉదయం ఆలపాటి పుష్పలత(39) ఇంట్లో పనులు చేసుకుంటూ ఉండగా గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి, ఆమెను చంపాడు. ఒంటిపై ఉన్న బంగారపు ఆభరణాలు తీసుకెళ్లినట్టు మృతురాలి భర్త తెలుపుతున్నాడు. పట్టణంలో గతేడాది జూన్ 19న కోటిరత్నం(75) , ఈ ఏడాది మార్చి 17న కొప్పరపు సావిత్రి(69)లను హత్య చేసి, దొంగతనాలకు పాల్పడ్డారు. దాదాపుగా అదే తరహాలో వినుకొండలో మూడో హత్య జరగడం ఆందోళన కలిగిస్తోంది.

గురజాల సబ్ డివిజన్‌లో వరుస చోరీలు

గురజాల సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది జనవరిలో వరుస దొంగతనాలతో దొంగలు హడల్ పుట్టించారు. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లినవారే లక్ష్యంగా గురజాల పట్టణంలో మూడు, పులిపాడు గ్రామంలో ఆరు, నడికుడి, శ్రీనివాసపురం గ్రామాల్లోని పలు ఇళ్లలో చోరీలు చేశారు. సీసీ కెమెరాలను పగలగొట్టి మరీ ఇళ్లలో విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఇలా గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల , రెంటచింతలలో వరుస దొంగతనాలు చేశారు. ఈ దొంగతనాలు ఒకే ముఠా చేశాయని, నార్త్ ఇండియాకు చెందిన ఈ దొంగలు సాయంత్రం రైళ్లలో దిగి రాత్రిపూటి దొంగతనాలు చేసి, తెల్లవారుజామున తిరిగి వెళ్లిపోతారని విచారణలో పాల్గొన్న పోలీసులు తెలుపుతున్నారు. ఈ ముఠాలను అరికట్టడంలో వారు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి.

గ్రామాల్లో రెక్కీ

పల్నాడు జిల్లాలో కీలకమైన రైల్వేలైన్ అయిన గుంటూరు–బీబీనగర్ లైన్‌లో ముఖ్యంగా పిడుగురాళ్ల, తుమ్మలచెరువు, నడికుడి స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రాలకు చెందిన పార్ధీ గ్యాంగ్, సోలాపూర్, మీర్జాపూర్, జూమ్‌కేడ్, బీడ్ తదితర ప్రాంతాలకు చెందిన నేరస్తులు సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసి, రైలు దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ దొంగతనాలకు లోకల్ పోలీసులకు సంబంధం ఉండదు. రైల్వే పోలీసులే విచారణ జరుపుతారు. అయితే, దొంగతనాలకు ముందు ఆయా ముఠాలు రైల్వే స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సంచరించి, రెక్కీ నిర్వహిస్తున్నాయి. జిల్లాలో పోలీసు నిఘా వ్యవస్థ గట్టిగా పనిచేస్తే వారి సంచారాన్ని గుర్తించి దొంగతనాలు జరగక ముందే అరెస్ట్ చేసే అవకాశముందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

గత నాలుగేళ్లుగా జరిగిన చోరీలు

సంవత్సరం	చోరీల సంఖ్య	చోరీ అయిన సొత్తు విలువ (రూ.కోట్లలో)	రికవరీ అయిన సొత్తు విలువ (రూ.కోట్లలో)	రికవరీ శాతం
2022	603	4.59	2.34	50.93
2023	344	6.57	3.88	59.07
2024	583	6.36	3.48	54.68
2025 (తొలి ఆరు నెలలో)	268	3.11	1.28	41.30



భారీగా దొంగతనాలతో ప్రజలు బెంబేలు

- పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే ఏకంగా 268 దొంగతనాలు జరిగాయి.
- ఇందులో 28 దొంగతనాలు పగటి పూట, 52 దొంగతనాలు రాత్రి పూట జరిగాయి.
- 187 సాధారణ చోరీలు, ఒక మహిళలను హత్యచేసి చోరీకి పాల్పడ్డారు.
- 268 దొంగతనాల్లో రూ.3.11 కోట్ల సొత్తు చోరీ జరగగా, అందులో పోలీసులు రూ.1.28 కోట్లను రికవరీ చేశారు.
- ఇది దొంగతనాలు జరిగిన దాంట్లో 41.30 శాతానికి సమానం.
- దొంగతనాలు అధికంగా చిలకలూరిపేట టౌన్‌లో 25, నరసరావుపేట వన్‌టౌన్, మాచర్లలో 18 చొప్పున, సత్తెనపల్లి టౌన్‌లో 17 జరిగాయి.

పోలీసుల నిర్లిప్తత

జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీల నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులుపెట్టి వేధించడానికే సిబ్బందిని వినియోగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో ఖాకీలు బిజీగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలు అధికమయ్యాయని ప్రజలు భావిస్తున్నారు. జిల్లాలో అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలతో వరుసగా పోలీసులు హైకోర్టుతో చివాట్లు తింటున్నారు. అయినా, వారి తీరులో మార్పు రావడం లేదు. పోలీసులు ఇప్పటికైనా జిల్లాలో దొంగతనాలు, హత్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఓట్ల తొలగింపు అన్యాయం

- కూటమి నేతల ఒత్తిడి
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపు
- వైఎస్సార్ సీపీ నేతల న్యాయ పోరాటం



కమిషనర్‌కి వినతిపత్రం అందిస్తున్న నేతలు

దాచేపల్లి : త్వరలో జరగనున్న ఉప ఎన్నికలో కూటమి అభ్యర్థి గెలుపు కోసమే వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డుకు త్వరలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. గత ఓటరు జాబితాలో 1,596 ఓట్లు ఉన్నాయి. తాజాగా అధికారులు తయారు చేసిన జాబితాలో 1,112 ఓట్లు మాత్రమే ఉన్నాయి. తాజాగా వెలువరించిన జాబితాలో 484 ఓట్లు మాయం అయ్యాయి. వీటిల్లో అత్యధికంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లే ఉన్నాయి. విషయం తెలుసుకున్న నేతలు గురువారం నగర పంచాయతీ కమిషనర్ జి. వెంకటేశ్వర్లు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 3వ వార్డులో తమ పార్టీకి చెందిన సానుభూతిపరుల ఓట్లు 484 మాయం చేశారని, కూటమి అభ్యర్థిని గెలిపించడం కోసమే అధికారులు కుమ్మక్కై ఈ కుట్ర చేశారని ఆరోపించారు. కమిషనర్ దీనిపై సమగ్ర విచారణ చేయకపోతే న్యాయపోరాటం చేస్తామని నేతలు చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నగుబండి గురువులు, ఈదా వెంకటరెడ్డి, దేవళ్ల రఘు, నాయకులు కొప్పుల కృష్ణ, కుందూరు తిరుపతి రెడ్డి, కోలా జంపాల రెడ్డి, కోలా శ్రీనివాస్ రెడ్డి, షేక్ సైదావల్లి, డాడీ, కోలా నరసింహారెడ్డి, పాపా ఉన్నారు.

దుర్వాసన.. నరకయాతన



పైప్‌లైన్ నుంచి లీకై ప్రవహిస్తున్న వ్యర్థ జలాలు

- మురుగు నీటి కాల్వ ఆక్రమణ
- వ్యర్థాలతో నీటిని యార్డులోకి వదులుతున్న దుకాణదారులు
- ఆవరణంతా దుర్గంధం
- దుర్వాసనతో అల్లాడుతున్న రైతులు
- ముక్కు మూసుకొని విధులు నిర్వహిస్తున్న అధికారులు



వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మురుగు నీరు

నరసరావుపేట టౌన్: షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారుల ఇష్టారాజ్యం.. అధికారుల నిర్లక్ష్యంతో వ్యవసాయ మార్కెట్ యార్డ్ దుర్గంధంగా మారింది. రైతులు ముక్కు మూసుకోవాల్సి వస్తుంది. దుకాణాల్లో వినియోగించిన వ్యర్థపు నీటిని మార్కెట్ యార్డులోకి వదులుతుండటంతో ఆవరణంతా కంపుగొడుతోంది. దుకాణాల ముందున్న మురుగు కాల్వను ఆక్రమించి వ్యాపారాలు నిర్మాణాలు చేపట్టారు. మురుగు పారేందుకు దారి లేదు. దుకాణాల వెనుక పైపులైన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా వినియోగించిన నీటిని పంపుతున్నారు. అయితే పైపులు లీకై మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో యార్డు పరిసరాలంతా దుర్వాసన వెదజల్లుతోంది.

రైతులకు అవస్థ

వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు దుర్వాసనతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు సమస్య ఎప్పటి నుంచో ఉన్నా శాశ్వత పరిష్కారంపై అధికారులు దృష్టి సారించలేదు. అధికారుల నిర్లక్ష్యంతో పంటల అమ్మకానికి రావాలంటే నరకయాతన తప్పటం లేదని రైతులు వాపోతున్నారు. దుర్వాసనలో రోజంతా కూర్చోలేక పోతున్నామని వాపోతున్నారు.

అధికారులకు సైతం తప్పని తిప్పలు

వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రజా పంపిణీ బియ్యం నిల్వ చేసే ఎంఎల్‌ఎస్ పాయింట్‌తో పాటు భూసార పరీక్ష కేంద్రం, అగ్రి టెస్ట్ ల్యాబ్, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం, 108 డివిజనల్ కార్యాలయం, ఈవీఎంలు భద్రపరిచిన గోదాం అన్నీ ఇక్కడే ఉన్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగం నుంచి ప్రతిరోజు పైప్‌లైన్ ద్వారా వృథా నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో అక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది, హమాలీలు దుర్గంధానికి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అనారోగ్యానికి గురవుతున్నామని పలువురు కార్మికులు వాపోతున్నారు. దీంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు పలు పనుల నిమిత్తం ప్రతిరోజు వచ్చే వందల మంది సైతం మురుగు దుర్వాసనకు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది.

వ్యర్థ జలాలు పారకుండా ఆక్రమణ

మార్కెట్ యార్డు దుకాణ సముదాయానికి, రోడ్డుకు మధ్యలో 50 అడుగుల ఖాళీ స్థలం ఉంది. అక్కడ గతంలో మురుగు పారేందుకు సైడ్ కాల్వ ఉండేది. కాలక్రమేణా దుకాణదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మురుగు తొలగించేందుకు అవకాశం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో దుకాణదారులు వెనుక భాగంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి వ్యర్థ జలాలను మార్కెట్ యార్డులోకి వదులుతుండటంతో సమస్య జటిలంగా మారింది. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, మురుగు కాల్వను మెరుగు పరచాలని రైతులు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటా !

వ్యవసాయ మార్కెట్ యార్డు దుకాణ సముదాయ నిర్వహణ ఆ శాఖ అధికారులే చూసుకోవాలి. కాల్వను ఆక్రమించిన విషయంపై విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. గతంలో అక్కడ మురుగు కాల్వ ఉంటే దాన్ని పునరుద్ధరించి సక్రమంగా పారేలా చూస్తాం.

జస్వంత్‌రావు, మున్సిపల్ కమిషనర్

రియల్టర్ దందా.. అడ్డుకట్ట ఉందా ?

- నరసరావుపేట మండలం కాకాని వద్ద మూడు ఎకరాల అసైన్డ్ ల్యాండ్ ఆక్రమణ
- ప్లాట్లు వేసి విక్రయాలు
- ఆక్రమించిన భూమి విలువ రూ.10కోట్లు
- ఆక్రమణకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల అండ





వరద కాలువ ఆక్రమించి వేసిన వెంచర్ (ఇన్‌సెట్) లక్ష్మీపురం వైపు నుంచి వచ్చే వరద కాలువ

నరసరావుపేట రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణలకు వాగులు, వంకలు, కాలవలు.. కాదేది అనర్హం అన్నట్టుగా నరసరావుపేటలో పరిస్థితి ఉంది. రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందిస్తుండటంతో వీరి ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. నూతనంగా జిల్లాగా ప్రకటించిన తరువాత నరసరావుపేటలో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. రూ. లక్షల్లో ఉన్న ఎకరం భూమి రూ.కోట్లకు చేరింది. నరసరావుపేట పట్టణం సమీపంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించింది. వందలాది ఎకరాల్లో వెంచర్లు వేసి విక్రయాలు జరిపారు. పొలాల్లోని పంట కాలువలను కూడా వెంచర్ల నిర్వాహకులు పూడ్చివేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. పంట కాలువలు పూర్తిగా మూసివేయడంతో సాగునీరు అందక రైతులు పలు చోట్ల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారు.

కాకానిలో మూడు ఎకరాలకు పైగా ఆక్రమణ

నరసరావుపేట మండలంలోని కాకాని సమీపంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ భూములను కొనుగోలు చేసి, రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసింది. కాకాని సమీపంలో జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కావడంతో ఆ పరిసర ప్రాంతాల్లోని భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో అనేక ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలు ఈ ప్రాంతంలో వెంచర్లు ఏర్పాటు చేశాయి. ఈ భూములకు సమీపంలో ఉన్న వరద కాలువను ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ పూర్తిగా ఆక్రమించింది. 505డీఏ1ఏ సర్వే నంబర్‌లో ఉన్న ఈ వరద కాలువ దాదాపు రెండున్నర ఎకరాల్లో ఉంది. లక్ష్మీపురం, కాకాని పంట పొలాల్లోని వర్షం నీరు ఈ కాలువ ద్వారా ప్రవహించాల్సి ఉంది. దిగువన నీటిని నిల్వచేసేందుకు చెక్ డ్యామ్ కూడా నిర్మించారు. దాదాపు 50 ఎకరాలకు పైగా పంట పొలాలకు ఈ చెక్‌డ్యామ్ నీరే ఆధారం. వెంచర్ ఒక వైపు కనిపిస్తున్న వరద కాలువ మధ్యలో అక్రమణకు గురైంది. మరో వైపు చెక్ డ్యామ్ ఉన్నా అక్కడకు నీరు వచ్చి చేరే అవకాశం లేకుండా రియల్ వ్యాపార సంస్థ ప్లాట్లు వేసి గోడను నిర్మించింది. మౌలిక సదుపాయాల కోసం వెంచర్ నిర్వహకులు దాదాపు ఎకరం ఖాళీ స్థలాన్ని కేటాయించారు. అసైన్డ్ ల్యాండ్‌ను ఆక్రమించి అదే భూమిని మౌలిక సదుపాయాలు కోసం కేటాయించినట్టు అధికారులకు చూపించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ ఆక్రమించుకున్న అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత జాబితాలో ఉంది. దీంతో సదరు సంస్థ సర్వే నంబరు మార్చి దర్జాగా ప్లాట్లను విక్రయించింది. ఇందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సహకరించారు. అసైన్డ్ భూమి ఆక్రమణలో గతంలో

అధికారుల కుమ్మక్కు

ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వ్యక్తి కీలకపాత్ర పోషించారని తెలుస్తోంది. ఆయన ఆశీస్సులతోనే ఈ వ్యవహారాన్ని నిశ్చింతంగా పూర్తి చేశారని సమాచారం. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు అందాయి. వరద కాలువను ఆక్రమించి ప్లాట్లు వేసి, వాటిని బహిరంగ మార్కెట్లో సెంటు రూ.3లక్షల వరకు సంస్థ అమ్మేసింది.



రియల్టర్ ఆక్రమణలోని అసైన్డ్ భూమి

చర్యలు తీసుకుంటాం



రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ అసైన్డ్ ల్యాండ్‌ను ఆక్రమించి వెంచర్ వేసిన విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరిపి అసైన్డ్ ల్యాండ్ ఉన్నట్టు తేలితే చర్యలు తీసుకుంటాం.

–కె. మధులత, ఆర్డీఓ, నరసరావుపేట

డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రారంభించింది. ఈ నెల 26వ తేదీ వరకు అవకాశం దీనికి కల్పించింది. విద్యార్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలను హెల్ప్ లైన్ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లోనే పరిశీలన చేస్తారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల నమోదు, సీట్ల కేటాయింపు, కళాశాలలో చేరికలు వరుస క్రమంలో జరగన్నాయి.

24 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, బాపట్లలోని మహిళా కళాశాలలు, చేబ్రోలు, రేపల్లె, వినుకొండ, మాచర్లలోని కో–ఎడ్యుకేషన్ కళాశాలలతో పాటు 70 ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. విద్యార్థులు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు డిగ్రీ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ విద్యార్థులు రూ.400, బీసీ రూ.300, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.200 చొప్పున చెల్లించాలి. అన్ని ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసిన విద్యార్థులు వాటి పరిశీలనకు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఆప్షన్లు మార్చుకునేందుకు 29న తుది అవకాశం ఉంటుంది. 31న సీట్ల కేటాయింపు జరుగుతుంది.

క్లుప్తంగా

28న విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినం

లక్ష్మీపురం: ఈ నెల 28వ తేదీన విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినాన్ని విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినంగా జరుపుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజానీకంపై భారీ ఎత్తున భారాలు మోపిందని, అప్పట్లో వామపక్ష పార్టీల నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్తు చార్జీలు పెంచబోమని, భారం తగ్గిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ అదనపు భారాలను ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతోను, ట్రూఅప్ చార్జీల పేరుతో మోపిందన్నారు. దీంతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా వేదిక ఆధ్వర్యంలో ప్రతిఘటన ఉద్యమం సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ నెల 28వ తేదీన జరిగే ప్రతిజ్ఞ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామ పక్ష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

25న రజకుల ధర్నాను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: కూటమి నేతలు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు కోసం ఈ నెల 25వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండూరు వెంకట నరసయ్య గురువారం పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాలను సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేయడం లేదని, మంత్రులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేస్తోందని విమర్శించారు. సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కోండయ్య, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పొగాకు కొనుగోళ్లపై మండిపాటు

ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారురాజు ఎదుట నాయకులు, రైతుల ఆక్రోశం

నాదెండ్ల: పొగాకు కొనుగోళ్లు మందకొండిగా సాగుతుండటంతో రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని నాయకులు అధికారులపై మండిపడ్డారు. చిలకలూరిపేట పాత మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కె. బంగారురాజు, జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా మేనేజర్లు నరసింహారెడ్డి, రమేష్, యార్డు కార్యదర్శి తిరుపతిరాయుడు సందర్శించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా, తెలుగు రైతు కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు, మండల నాయకులు మదన్‌మోహన్, సాయిబాబు, యార్డు డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి పొగాకు కొనుగోళ్లపై అధికారులను ప్రశ్నించారు. రెండు నెలలుగా కొనుగోలు జరుగుతున్నా ఇంతవరకూ ఓ కొలిక్కి రాలేదని, ఇంకా కొనాల్సిన పొగాకు ఎక్కువగా ఉందని తెలిపారు. ఖరీఫ్ ప్రారంభమై వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున, రైతులు పొగాకు అమ్ముకునేందుకు యార్డు వద్ద పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు రైతులకు దక్కడం లేదని తెలిపారు. ఇప్పటి వరకూ చిలకలూరిపేట ప్రాంతంలో 15–20 వేల క్వింటాళ్ల పొగాకు మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో 90 వేల క్వింటాళ్లకు పైగా పొగాకు రైతుల వద్ద నిల్వ ఉందని, కొందరు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వచ్చిందని వివరించారు. అధికారులు త్వరితగతిన కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.


బంగారురాజుతో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

అమరావతిలో సూపర్‌వైజరీ కమిటీ పరిశీలన

తాడికొండ: రాజధాని అమరావతిలో కేంద్ర పర్యావరణం, అటవీ– వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ అమన్‌దీప్ గార్గ్ తదితరులు గురువారం పర్యటించారు. తొలుత ఉండవల్లిలోని రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, కొండవీటి వాగు వరద పంపింగ్ స్టేషనును పరిశీలించారు. సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్‌లు ఇక్కడి ఏర్పాట్లను ఆయనకు వివరించారు. సీఆర్డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) ఆధ్వర్యంలో అమరావతిలో వరద నిర్వహణ చర్యల నిమిత్తం ప్రస్తుతం అమలవుతున్న, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యకలాపాలు, ప్రణాళికలపై సూపర్‌వైజరీ కమిటీ తరఫున విచ్చేసిన అమన్‌దీప్ గార్గ్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. అనంతరం అమరావతి సీడ్ యాక్సిస్ రహదారి సమీపంలోని ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం, గ్రీనరీ, ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి పనుల వివరాలను సీఆర్డీఏ కమిషనర్ వివరించారు. అనంతరం అధికారులతో కలసి అమన్‌దీప్ గార్గ్ అమరావతిలోని టిడ్కో గృహ సముదాయాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారుల కోసం నిర్మించిన భవనాల సముదాయాలను సందర్శించారు. నిర్మాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలోని ట్రాన్స్‌లొకేటెడ్ నర్సరీని అమన్‌దీప్ గార్గ్ సందర్శించారు. అనంతరం అమరావతి సచివాలయంలో సూపర్‌వైజరీ కమిటీతో సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు సమావేశమయ్యారు. కమిటీ సభ్యులలోని మరొక ముగ్గురు అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఈ సమావేశానికి హాజరు అయ్యారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న భవనాల పనులలో పురోగతి, రాజధాని ప్రాంత నివాసితులకు అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణకు చేపట్టిన కార్యకలాపాలు, కార్మికులు, మహిళల భద్రతకు అమలవుతున్న చర్యల గురించి సీఆర్డీఏ అధికారులు వారికి వివరించారు. సమావేశంలో ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, వివిధ విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న అమన్‌దీప్ గార్గ్

మైక్రో ఫైనాన్స్ సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా



రేపల్లె: రేపల్లె పట్టణంలో అధిక వడ్డీలు కట్టాలని వేధింపులకు గురిచేస్తున్న మైక్రోఫైనాన్స్ సంస్థల నుంచి బాధితులకు రక్షణ కల్పించాలని బాధిత మహిళలు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆఫీసుల ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఇళ్ల పట్టాల మీద లోన్ ఇస్తామని పేదలను నమ్మించి ఇంగ్లీషులో ఉన్న అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు చేయించుకొని అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని విమర్శించారు. 12 శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదని నిబంధనలు ఉన్నప్పటికీ 30 శాతం వరకు వసూలు చేస్తూ పేదలను పీడిస్తున్నారన్నారు. రాత్రి ఆరు గంటల తర్వాత లోన్ రికవరీ పేరుతో మహిళలకు ఫోన్ చేసి వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత మహిళలు సింధు దేవి, తిరుపతమ్మ, కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, మోషే, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి గోవాడలో కోటి కుంకుమార్చన

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడ శైవ క్షేత్రమైన శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రావణ బహుళ అమావాస్య నుంచి 11 అమావాస్యలు పురస్కరించుకుని కోటి కుంకుమార్చన, సామూహిక లలిత పారాయణ మహోత్సవం జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి బి. అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 23న సెప్టెంబర్, అక్టోబర్ 21న, నవంబర్, డిసెంబర్ 19న, 2026 జనవరి 18న, ఫిబ్రవరి 17న, మార్చి 18, ఏప్రియల్ 17న, మే 16న, జూన్ 14న అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు తెలిపారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు మేలు

మాచవరం : ఉద్యాన పంటల సాగుతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, పిన్నెల్లి, వేమవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. మిరప, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలను పరిశీలించారు. రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.మిరప, కూరగాయలు, ఆయిల్ పామ్ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ, యాజమాన్యం పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. ఎండు తెగులు ఆశించిన జామ చెట్లకు 1గ్రా. కార్బెన్‌డజిమ్ లేదా 3గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి చెట్టు మొదట్లో పోయాలని తెలిపారు. జింక్, మెగ్నీషియం ధాతు లోప నివారణకు 2గ్రా. జింక్ సల్ఫేట్, 2గ్రా. మెగ్నీషియం సల్ఫేట్, 10 గ్రా. యూరియా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల హార్టీకల్చర్ ఆఫీసర్ అంజలి బాయి, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ కరుణ కుమారి, ప్రభాకర్ రెడ్డి, సాగర్ బాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.


భీమవరంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ వెంకట్రావు

బీసీల రక్షణ కోసం చట్టం అవసరం

ప్రభుత్వాన్ని కోరిన సంఘ నాయకులు

నరసరావుపేట: వెనకబడిన తరగతుల(బీసీ)పై రోజురోజుకూ దాడులు, వివక్ష, దౌర్జన్యం, సామాజిక బహిష్కరణకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఏపీ బీసీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. ట్రయాంగ్ సిటీ హోటల్‌లో గురువారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం నాయకుల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక చట్టం వల్ల బీసీలకు రక్షణతో పాటు వారిపై వివక్షను సమూలంగా అరికట్టగలదని నమ్మకం వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ పనుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం నియమించిన అన్ని కమిషన్లు రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీలు సామాజికం, ఆర్థికం, రాజకీయంగా వెనకబాటులో ఉన్నారని పేర్కొన్నాయని తెలిపారు. బీసీ నిరుద్యోగుల కోసం ఎస్సీ, ఎస్టీల మాదిరి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకుల విద్యాలయాలు, స్టడీ సర్కిళ్లు, వసతి గృహాలను సకల సౌకర్యాలతో నిర్మించాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

కబడ్డీ పోటీల్లో ఈపూరు విద్యుత్ సిబ్బంది సత్తా


టీంను అభినందిస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

ఈపూరు(శావల్యాపురం): రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో ఈపూరు మండల విద్యుత్ సిబ్బంది పల్నాడు జిల్లా టీం తరఫున ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమని నరసరావుపేట ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో గురువారం పోటీల్లోని విజేతలు పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, కంచర్ల ఏడుకొండలు, సన్నిబోయిన రామాంజినేయులు, అచ్యుత్, మల్లికార్జున్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ అంకితభావంతో విధుల నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించటం ప్రశంసనీయమని తెలిపారు. మానసిక వికాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పిన్నబోయిన వెంకటేశ్వరరావు ఎంపిక కావడంతో ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో డీఈ రాంబొట్ల, ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, ఏఈ సంపెంగుల గాంధీ ఉన్నారు.

పింఛన్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం

- రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఆగస్టీన్


మాట్లాడుతున్న ఆగస్టీన్


నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా... ఉన్న దివ్యాంగ పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బి. ఆగస్టీన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో దివ్యాంగ విభాగం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి తర్వాత రాష్ట్ర ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. ఎన్నికల హామీలో మాత్రం రూ.6 వేలు పింఛను ఇస్తామని చెబితే సంబరపడ్డామని.. ఇప్పుడు నిర్దయగా తీసేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 80 శాతం వైకల్యం ఉంటే ఇప్పుడు 40 శాతం ఉన్నట్లు చూపించి పింఛన్లు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి కూడా మొండిచేయి చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రులకు, ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని వల్ల దివ్యాంగులు కార్యాలయాల మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

నాడు అండగా వైఎస్ జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దివ్యాంగులకు అండగా నిలిచారన్నారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి తమ కష్టాలను తీర్చారని దివ్యాంగులు పేర్కొన్నారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ తీసేయడంతో ఏ పని కావాలన్నా కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారి కోసం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులతో కలిసి నిరసన చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన విధంగానే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి గణేష్‌బాబు, కొమ్మా లింగరావు, శంకర్, జె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్ట్

మర్రిపాలెం (విశాఖ జిల్లా): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఊహించని మలుపు చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారులో గంజాయిని గుర్తించిన పోలీసులు, ఆ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ నెల 12న సుభాష్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కారు ఢీకొని ఏడాదిన్నర చిన్నారి వర్షిత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ ఆర్ముగంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఉన్న మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు ఈ నెల 16న సీజ్ చేసిన కారును తనిఖీ చేయగా.. 21 కిలోల గంజాయిని గుర్తించారు. పరారీలో ఉన్న ముగ్గురినీ అరెస్ట్ చేశారు. వారిని హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న గుంటూరుకు చెందిన అక్షయ గౌతమి(20), షేక్ మహమ్మద్ జాకీర్ (19), ఒంగోలుకు చెందిన పెర్లి విజయవర్ధన్ రాజు (25)గా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వీరు విజయవాడలో కారు అద్దెకు తీసుకుని అరకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా ఊర్వశి జంక్షన్ సమీపంలోని సుభాష్‌నగర్ వద్ద ప్రమాదం జరిగింది. పెర్లి విజయవర్ధన్ రాజుపై ఇప్పటికే ఒంగోలులో 11 కేసులు ఉన్నాయని, మహమ్మద్ జాకీర్‌పై కూడా గంజాయి కేసు ఉందని పోలీసులు వెల్లడించారు. యువతికి తల్లిదండ్రులు లేరు. విజయవర్ధన్‌కు బంధువు కావడంతో అతనితో ఇలా వెళ్తూ ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎస్ఐలు షేక్ సమీర్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

ప్రభుత్వ ఉద్యోగులపై ‘అవుట్ సోర్సింగ్’ వారి పెత్తనమా?

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్

నెహ్రూనగర్: రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కోసం మూడు అంచెలుగా మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి వ్యవస్థను ప్రభుత్వం తీసుకురాబోతుందని, అందులో భాగంగా గ్రామ వార్డు సచివాలయాలను పర్యవేక్షించే మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేయడానికి 1,785 మంది సిబ్బందిని డిప్యూటేషన్/ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించడానికి కేబినేట్ ఆమోదించడం అనాలోచిత చర్య అని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలనే కనీస ఆలోచన లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన వారిని పర్యవేక్షించడానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. అర్హులైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మండల, జిల్లా స్థాయి సచివాలయ ప్రధాన కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఆరు సంవత్సరాలుగా వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శుల నుంచి ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని తొలగించి ఇతర ఉద్యోగులకు కేటాయించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఈ నిర్ణయం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని తెలిపారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి

గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశం

నగరంపాలెం: పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. గుంటూరు పశ్చిమ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ రికార్డులు, కేసు డైరీలు, క్రైమ్ రిజిస్టర్, పెండింగ్ కేసుల ఫైల్స్, పెండింగ్ దర్యాప్తుల పురోగతి, నిందితుల అరెస్టులు, కోర్టు హాజరు స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ నేర నిరోధక చర్యలను మరింత వేగవంతంగా చేపట్టాలని చెప్పారు. పెండింగ్ కేసుల దర్యాప్తులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. నిందితులకు త్వరగా న్యాయస్థానాల్లో శిక్షలు అమలయ్యేలా విధులు నిర్వర్తించాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల కార్యకలాపాలలో పారదర్శకత చూపాలని ఆదేశించారు. క్రమశిక్షణ, సంక్షేమంపై దృష్టిసారించి, సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. తనిఖీల్లో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్, పట్టాభిపురం, అరండల్‌పేట, నగరంపాలెం పీఎస్‌ల సీఐలు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి. చిత్రంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

రేపు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ధర్నా

లక్ష్మీపురం: జీవో నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా పోస్టర్‌ను గురువారం గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, హాస్టల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సౌమ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి


ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తెనాలి టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి మాట్లాడుతూ ఈకేవైసీ, ఫేస్ రికగ్నేజేషన్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన వలన లబ్ధిదారులకు సకాలంలో ఫీడింగ్ ఇవ్వలేకపోతున్నట్లు ఆరోపించారు. 10 ఏళ్ల క్రితం ఇచ్చిన స్మార్ట్ ఫోన్ల వలన నెట్‌వర్క్ సరిగా పనిచేయక లబ్ధిదారులు ఒకటికి మూడు సార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు తమపై అసహనం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో లబ్ధిదారులకు ఫీడింగ్ ఇవ్వడం కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సీడీపీవో విజయగారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, కె.రంగపుష్ప, రాధిక, రాజకుమారి, రామలక్ష్మి, రాహెలమ్మ, ఎస్కే ముని, వహీదా, సీహెచ్ శివకుమారి, కె.మాధవి, డి.కళ్యాణి, ఎం.సుజాత, వై.నాగమల్లేశ్వరి, కె.లక్ష్మి , బుల్లెమ్మ, ఎలిజిబెత్ రాణి, రమాదేవి, త్రివేణి, అలిషా బేగం, జ్యోతి, సునీత, రజియా తదితరులు ఉన్నారు.